క్లుప్తంగా

గట్టు మల్లన్న ఆలయ హుండీల లెక్కింపు



వేలేరు : మండలంలోని మల్లికుదుర్ల శివారులోని గట్టు మల్లికార్జునస్వామి ఆలయ హుండీలను ఆలయ ఈఓ అద్దంకి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం లెక్కించారు. 75 రోజులకు గాను హుండీల ద్వారా రూ.73,163, ఇతర ఆ ర్జిత సేవల ద్వారా రూ.1,75,467 రాగా మొ త్తం 2,48,630ల ఆదాయం వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ డివిజన్ పరిశీలకులు అనిల్ కుమార్, ఆలయ అర్చకులు మహేష్ శర్మ, ఒగ్గు పూజారులు తదితరుల పాల్గొన్నారు.

బాల్యమిత్రుడికి ఆర్థిక సాయం



కమలాపూర్ : మండలంలోని ఉప్పల్‌కు చెందిన ఎండీ.అజ్మతుల్లా కాలు కోల్పోయి అనారోగ్యంతో బాధపడుతుండగా తమతో చిన్నప్పుడు చదువుకున్న (1988–89 పదో తరగతి బ్యాచ్) బాల్య మిత్రుడికి తోటి స్నేహితులు ఆర్థిక సాయం అందించి అండగా నిలిచారు. మారపెల్లి మహేష్‌కుమార్ ఆధ్వర్యంలో మిత్రులు కలిసి సోమవారం రాత్రి అజ్మతుల్లాకు రూ.56 వేల ఆర్థిక సాయం అందించి తాము అండగా ఉన్నామని భరోసా కల్పించారు. సాయం అందజేసిన వారిలో పూసాల గణేష్, మెకిడ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

సీఐటీయూలో చేరిన అంగన్‌వాడీ టీచర్లు



పరకాల : అంగన్‌వాడీలతో అదనపు పనులు చేయించకుండా కనీస వేతనం రూ.26వేల అందజేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ డిమాండ్ చేశారు. పరకాల పట్టణంలో మంగళవారం జరిగిన సీఐటీయూ సమావేశంలో మండలంలోని నాగారం, ఊరుకొండ సెక్టార్లకు చెందిన 70 మంది అంగన్‌వాడీ టీచర్లు, సహాయకులు సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేశ్ సమక్షంలో సీఐటీయూలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐసీడీఎస్‌కు కేంద్ర ప్రభుత్వం క్రమంగా తగ్గించి ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేయాలని చూస్తుందన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కాసం లీలావతి, దుర్గం రజిత, ఎస్.కోమల, బి.భాగ్యలక్ష్మి, కె.కోమల, జి.సుజాత,జి.విజయ, కె.కొమురమ్మ, జి.నిర్మల తదితరులు పాల్గొన్నారు.

‘పీరీల షెడ్ తొలగించాలి’

సంగెం : మండల కేంద్రంలోని పాత బొడ్రాయి వద్ద ఏర్పాటు చేసిన తాత్కాలిక పీరీల షెడ్‌ను అధికారులు తొలగించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ పగడాల కాళీప్రసాదరావు మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. గతంలో బందెలదొడ్డి స్థలంలో పీర్లను పెట్టి తీసేశాక 20 ఏళ్లుగా స్థానిక గణేశ్ మండపం ఏర్పాటు చేసి ఉత్సవాలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఈ ఏడాది పీరీల షెడ్ తీసేయకపోగా స్థలం తమదేనంటూ నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఈ క్రమంలో ఉత్సవ కమిటీ నిర్వాహకులు పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేశారని తెలిపారు. సదరు భూమి గ్రామ కంఠంలోనిదని, అధికారులు స్పందించి షెడ్ తొలగించి గణపతి ఉత్సవాల నిర్వహణకు అనుమతించాలని కోరారు.

ఆర్థికసాయం



గీసుకొండ : మండలంలోని ధర్మారం ప్రాంతానికి చెందిన సిలువేరు శాంతమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా స్థానిక శ్రీ వారాయి పరపతి సంఘం సభ్యులు బాధిత కుటుంబానికి మంగళవారం 25 కిలోల బియ్యంతోపాటు ఆర్థికసాయం అందించారు. తొలుత శాంతమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ప్రబలుతున్న విషజ్వరాలు

- మండల కేంద్రంలో 151 నమోదైన జ్వరాల కేసులు
- వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి
- డాక్టర్ సాయికృష్ణ



డాక్టర్ సాయికృష్ణ



శాయంపేటలోని పీహెచ్‌సీలో పరీక్షలు చేయించుకుంటున్న ప్రజలు



జ్వరంతో ఇబ్బందులు పడుతున్న చిన్నారులు

శాయంపేట : ప్రస్తుత సీజన్‌లో డెంగీ, మలేరియా, టైఫాయిడ్ లాంటి విషజ్వరాలు ప్రబలుతున్నాయన్నారు. విషజ్వరాలపై నిర్లక్ష్యం ప్రదర్శించవద్దని వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స చేయించుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సాయికృష్ణ అన్నారు. ప్రజలు సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మండలంలో ఇప్పటికే ఆగస్టు నెలలోనే 151 మందికి టైఫాయిడ్, డెంగీ, మలేరియా జ్వరాలు వచ్చాయని తెలిపారు. ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు ఇంటింటికి తిరిగి ఫీవర్ సర్వే చేస్తున్నారన్నారు. జ్వరంతో బాధపడుతున్న వారిని గుర్తించి పీహెచ్‌సీకి వైద్య పరీక్షల నిమిత్తం పంపిస్తున్నట్లు తెలిపారు. అంతే కాకుండా లిపిడ్ ప్రొఫైల్, థైరాయిడ్, ఎల్ఎఫ్‌టీ, కిడ్నీ పరీక్షలు, కొలెస్ట్రాల్ పరీక్షల కోసం రక్త నమూనాలు సేకరించి శాంపిల్స్ వరంగల్‌లోని టీహబ్‌కు పంపించి రెండు, మూడు రోజులలో రక్తపరీక్షలు రిపోర్టులు అందిస్తున్నట్లు తెలిపారు. మహిళలకు క్యాల్షియం, బి–12, యూరిక్ యాసిడ్ పరీక్షలు చేసి వరంగల్ టీ హబ్‌కు రక్త నమూనాలు పంపినట్లు తెలిపారు. ప్రజలు తమ ఇంటి చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తమ ఇంటి ఆవరణలో మొక్కల కుండీల్లో, నీరు నిల్వ ఉండే ప్రదేశాల్లో, ఇంటీ ఆవరణలోని నీరు ప్రవహించే కాల్వలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని తెలిపారు. జ్వరాలు వచ్చినట్లయితే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గానీ, సబ్ సెంటర్‌లో గానీ చికిత్సలు చేసుకుని మందులు వాడాలని వైద్యులు పేర్కొన్నారు.

యోగాసన పోటీల్లో టీఎంఎంస్ విద్యార్థుల ప్రతిభ



సమన్విత్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ అనిత

కమలాపూర్ : హనుమకొండ జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 25న హనుమకొండలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లాస్థాయి 10–14 ఏళ్ల విభాగం, 14–18 ఏళ్ల విభాగం పోటీల్లో కమలాపూర్‌లోని తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబర్చారు. 10–14, 14–18 ఏళ్ల విభాగం పోటీల్లో పదో తరగతి విద్యార్థి ఎస్.సమన్విత్ ట్రెడిషనల్ యోగాసన, ఫార్వర్డ్ బెండింగ్ యోగాసన పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచాడు. 10–14 ఏళ్ల విభాగం ట్విస్టింగ్ యోగాసన పోటీల్లో ఏడో తరగతి విద్యార్థి వి.నాగతేజ మూడో స్థానంలో నిలిచి బహుమతులు గెలుచుకున్నారు. యోగా పోటీల్లో అత్యంత ప్రతిభ కనబర్చి పతకాలు సాధించిన ఇద్దరు విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ జి.అనిత, ఉపాధ్యాయులు మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు యోగా ప్రాధాన్యతను గుర్తించి శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలని, యోగాలో యువతకు విద్య, ఉద్యోగ రిజర్వేషన్లు కల్పిస్తున్నారని, వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కాంగ్రెస్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి



నినాదాలు చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ధర్మసాగర్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ కందుకూరి సోమన్న మాదిగ, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు బండారి సురేందర్ మాదిగ డిమాండ్ చేశారు. మండలంలోని క్యాతంపల్లి గ్రామంలో మంగళవారం కురసం పెల్లి కొమురయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడుతూ అందాల పోటీలకు, భూస్వాములకు, రైతు భరోసాకు, అభివృద్ధి పేరుతో వేల కోట్లు ఖర్చు పెడుతున్నప్పుడు, కాళ్లు, కళ్లు, మాట్లాడలేని దివ్యాంగులకు, వృద్ధులకు, వితంతువులకు, ఇతర రోగులకు ఎందుకు ఇచ్చిన మాట నిలబెట్టుకొని పెన్షన్ పెంచకుండా అన్యాయం చేస్తున్నావో ఈ సమాజానికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. డిసెంబర్లోనే పెన్షన్లు పెంచుతామని హామీ ఇచ్చి నెలలు గడుస్తున్నా నేటికీ పింఛన్లు పెంచకుండా వారి పెన్షన్ డబ్బులను పక్కదారి పట్టించి ద్రోహం చేశారని మండిపడ్డారు. ఈ ప్రభుత్వం చేస్తున్న అన్యాయాన్ని ప్రశ్నించకుండా ప్రతిపక్ష పార్టీలు కూడా అన్యాయం చేస్తున్నాయన్నారు. వెంటనే చేయూత పెన్షన్లను పెంచకపోతే రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, ఈనెల 28న స్టేషన్ ఘనపూర్లో జరిగే సదస్సు, సెప్టెంబర్ 9న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్లో లక్షలాది మందితో జరిగే మహాగర్జన సభతో కుప్ప కూల్చుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి గంగారపు శ్రీనివాస్ గంగారపు వెంకటస్వామి, ఐలయ్య, మల్లయ్య, సాయిలు, మల్లయ్య, బుచ్చయ్య, లింగయ్య, అనిల్, లింగయ్య, సంపత్, లింగయ్య, కొమురయ్య, కవిత, రాజమ్మ, తదితరులు పాల్గొన్నారు

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

- ఉద్యమకారుల ఫోరం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పాడిశెట్టి గణేశ్



పోస్టుకార్డులను రాహుల్‌గాంధీకి పంపిస్తున్న ఉద్యమకారులు

శాయంపేట : తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని దేశ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి మంగళవారం ఉద్యమకారుల ఫోరం నాయకులు మండల కేంద్రంలోని పోస్టాఫీస్ వద్ద పోస్ట్‌కార్డులు పంపించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉద్యమకారుల ఫోరం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పాడిశెట్టి గణేశ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు 250 గజాల ఇంటి స్థలం, రూ. 25వేల గౌరవ వేతనం, ఉచిత బస్సు, ట్రైన్ సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు గిద్దమారి సురేష్, కొమ్ముల శివ, రంగు మహేందర్, వనం దేవరాజ్, సామల భిక్షపతి, ఎండీ రఫీ, బాసాని నవీన్, తుమ్మ ప్రభాకర్, కానుగుల నాగరాజు, ఎండి రాజ్ మహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం బారులుదీరిన రైతులు



యూరియా కోసం బారులుదీరిన రైతులు

పరకాల: యూరియా కోసం మాధారం పీఏసీఎస్ పరిధిలోని రైతులు పరకాల వ్యవసాయ మార్కెట్ యార్డులోని గోదాం వద్ద బారులుదీరారు. రెండు రోజులుగా యూరియా కోసం తిరుగుతుంటే స్వైప్ మిషన్ పనిచేయడం లేదంటూ టోకెన్లు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడ్డ రైతులు మంగళవారం పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. యూరియా పంపిణీ పర్యవేక్షణలో ఉన్న ఏఓ శ్రీనివాస్‌ను, పీఏసీఎస్ అధికారులు, ఉద్యోగులను రైతులు నిలదీశారు. ఒక వైపు వర్షం పడుతుంటే యూరియా బస్తాల కోసం మహిళా రైతులు సైతం గోదాం ఆవరణంలో వరుసగా నిలబడి పడిగాపులు కాశారు.

యూరియా కొరత తీర్చాలంటూ ఆందోళన

పాలకులు చెబుతున్నట్లు యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని సీపీఎం పరకాల పట్టణ కార్యదర్శి బొచ్చు కల్యాణ్ డిమాండ్ చేశారు. యూరియా బస్తాలను లింక్ పెట్టి అమ్ముతున్నారనే సమాచారంతో గ్రోమోర్ ఎదుట సీపీఎం కార్యకర్తలు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కల్యాణ్ మాట్లాడుతూ అధికారుల పర్యవేక్షణలోనే కాకుండా నిరంతరం రైతులకు యూరియాను అధిక ధరకు కాకుండా సబ్సిడీ ధరకు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం కార్యకర్తలు వరుణ్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలి

- ఎంఈఓ సునీతారాణి, ఎంపీడీఓ వీరేశం



ఎల్కతుర్తి: బోధనాభ్యసన కృత్యమేళాను పరిశీలిస్తున్న ఎంపీడీఓ వీరేశం



వేలేరు: మాట్లాడుతున్న ఎంఈఓ చంద్రమౌళి



ధర్మసాగర్ : మాట్లాడుతున్న తహసీల్దార్ సదానందం

ఎల్కతుర్తి : విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించడం ఉపాధ్యాయుల బాధ్యత అని ఎంఈఓ సునీతారాణి, ఎంపీడీఓ వీరేశం అన్నారు. భీమదేవరపల్లి మండల స్థాయి ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల బోధనాభ్యసన సామాగ్రి మేళాను స్థానిక జెడ్పీ పాఠశాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మండలంలోని వివిధ పాఠశాలల నుంచి తయారు చేసిన బోధన సామగ్రిని ప్రదర్శించారు. జిల్లాస్థాయికి ఎంపికైన ఉపాధ్యాయులను అభినందించారు.

వేలేరు: విద్యార్థులకు బోధనోపకరణాలతో బోధన సులభతరం అవుతుందని ఎంఈఓ చంద్రమౌళి అన్నారు. మంగళవారం స్థానిక విద్యావనరుల కేంద్రంలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు మండల స్థాయి కృత్యమేళా ప్రదర్శనను నిర్వహించారు. ఉపాధ్యాయులు తయారు చేసిన వివిధ కృత్యాలను ప్రదర్శించారు. వీటిలో నుంచి 10 కృత్యాలను జిల్లా స్థాయి ప్రదర్శన మేళాకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో పీచర కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీదేవి, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిష్కారం చూపే దిశలా బోధన ఉండాలి

ధర్మసాగర్ : రోజువారి సమస్యల పరిష్కారం చూపే దిశలా బోధన ఉండాలని తహసీల్దార్ సదానందం అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం ఎంఈఓ రామ్‌దస్ అధ్యక్షతన మండల స్థాయి ఉపాధ్యాయుల టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ మేళా నిర్వహించారు. ఈ మేళాను తహసీల్దార్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు తమ బోధనలను విద్యార్థులు తమ రోజువారి ఎదుర్కొనే సమస్యల పరిష్కారానికి తోడ్పాటు అందించేలా కృత్యాదారులతో చేయాలని తెలిపారు. మండలంలోని 26 పాఠశాలల నుంచి ఉపాధ్యాయులు పాల్గొని తెలుగు, ఆంగ్లం, గణితం, పరిసరాల విజ్ఞానం విషయాల్లో వారు తయారు చేసిన కృత్యాలను ప్రదర్శించారు. న్యాయ నిర్ణేయితలుగా డైట్ విశ్రాంత అధ్యాపకులు సోమయ్య, సీనియర్ ఉపాధ్యాయులు మూల్యాంకనం చేసి 10 ప్రతిభావంతంగా ఉన్న కృత్యాలను జిల్లా స్థాయి మేళాకు ఎంపిక చేశారు.

సిబ్బంది అంకితభావంతో పనిచేయాలి

- పరకాల ఏసీపీ సతీశ్‌బాబు



రివార్డులు అందజేస్తున్న ఏసీపీ సతీశ్‌బాబు

ఆత్మకూరు : పోలీస్ సిబ్బంది అంకితభావంతో పని చేయాలని అప్పుడే గుర్తింపు వస్తుందని పరకాల ఏసీపీ సతీశ్‌బాబు అన్నారు. మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. స్టేషన్‌లో పరిసరాలను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. కేసుల పురోగతిని సీఐ సంతోష్‌ను అడిగి తెలుసుకున్నారు. హెడ్‌కానిస్టేబుళ్లు నర్సింగరావు, కుమారస్వామి, కానిస్టేబుళ్లు శ్రీనివాస్, ప్రవీణ్‌లకు రివార్డులు అందచేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతిభద్రతలను పరిరక్షించాలన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు తిరుపతి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ఆదుకోవాలి

- తెలంగాణ అంబేడ్కర్ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి ప్రకాశ్

ఎల్కతుర్తి: దేశవ్యాప్తంగా యూరియా కొరతతో రైతాంగం అల్లాడుతోందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యూరియా కొరుతను అరికట్టి రైతాంగాన్ని ఆదుకోవాలని తెలంగాణ అంబేడ్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ఒక రైతుకు ఒక యూరియా బస్తా మాత్రమే ఇవ్వడం సబబు కాదన్నారు. ఇప్పటికే కురుస్తున్న వర్షాలతో అన్నదాతలు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బహిరంగ మార్కెట్‌లో యూరియా కృత్రిమ కొరతను నిరోధించి, సకాలంలో అవసరమైన మేరకే రైతులకు యూరియా అందేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. రైతాంగ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

క్షయ వ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్ల పంపిణీ



క్షయ వ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్లు అందజేస్తున్న వైద్యాధికారి ప్రదీప్‌రెడ్డి

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని క్షయ వ్యాధిగ్రస్తులకు మంగళవారం డాక్టర్ ప్రదీప్‌రెడ్డి ఆధ్వర్యంలో పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రదీప్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా వైద్యాధికారి డాక్టర్ అప్పయ్య, జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ హిమబిందు ఆదేశాలతో పోషకార కిట్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. వ్యాధిగ్రస్తులు చికిత్సతోపాటు పోషకాహార కిట్లను వినియోగించుకొని వ్యాధినుంచి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. దీంతోపాటు సరైన పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది మల్లీశ్వరి, జ్యోతి, సూపర్‌వైజర్ రాజయ్య, రత్న భారతి, సురేందర్, సత్యవేద, రాజు, వనజ, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్ సత్తా చాటాలి



ఆత్మకూరు: కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న సంజీవరెడ్డి



నడికూడ : మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దురిశెట్టి చందు

ఆత్మకూరు : రానున్న స్థానిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్ సత్తా చాటాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు లేతాకుల సంజీవరెడ్డి అన్నారు. మండలంలోని హౌజుబుజుర్గు, కటాక్షపూర్ గ్రామాల్లో మంగళవారం కార్యకర్తల సమావేశాలు నిర్వహించారు. సమావేశాల్లో బీఆర్‌ఎస్ మండల ప్రధానకార్యదర్శి బొల్లోజు కుమారస్వామి, మాజీ ఏఎంసీ చైర్మన్ కాంతాల కేశవరెడ్డి, నాయకులు సావురే రాజేశ్వర్‌రావు, శ్రీరాంశెట్టి సుమన్, ముత్యాల మహేందర్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

నడికూడ: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దురిశెట్టి చందు అన్నారు. మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం మండలంలోని నర్సక్కపల్లి, మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న తప్పులను ఎప్పటికప్పుడు తిప్పి కొట్టాలని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో మండల బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మట్టి వినాయకులను పూజించాలి



ఎల్కతుర్తి : మట్టి వినాయకులను తయారు చేసిన విద్యార్థినులతో ఉపాధ్యాయురాళ్లు



వేలేరు : తయారు చేస్తున్న విద్యార్థినులు



ఐనవోలు : విద్యార్థులు తయారు చేసిన వినాయకులతో ఉపాధ్యాయులు

ఎల్కతుర్తి : మట్టి వినాయకులను పూజించి పర్యావరణాన్ని కాపాడాలని నేషనల్ గ్రీన్ కార్ప్స్ పిలుపు మేరకు విద్యార్థులు మట్టి విగ్రహాలను తయారు చేశారు. మంగళవారం భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నేషనల్ గ్రీన్ కార్ప్స్(ఎన్‌జీసీ) ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహాలను విద్యార్థులు తయా రు చేశారు. ప్రధానోపాధ్యాయురాలు ప్రభావతి ప్రతిమలను తయారు చేసి పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణకు తమ వంతు కృషి చేస్తామని ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు.

ఐనవోలు : పర్యావరణాన్ని పరిరక్షిద్దాం.. మట్టి గణపతులనే పూజిద్దాం అంటూ స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం మట్టి గణపతులను విద్యార్థులతో తయారు చేయించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం వెంకటేశ్వర్‌రావు, విద్యావారధి అధ్యక్షుడు బీమళ్ల సారయ్య మాట్లాడుతూ గణపతి నవరాత్రి ఉత్సవాలను పర్యావరణహితంగా నిర్వహించుకోవాలని సూచించారు. పర్యావరణానికి నష్టం కలిగించే ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసిన విగ్రహాలను కాకుండా మట్టితో చేసిన వినాయకులను వినియోగించాలన్నారు.

కేజీబీవీలో మట్టి వినాయకుల తయారీ

వేలేరు: ప్రతీ ఒక్కరూ మట్టి వినాయకులనే పూజించి పర్యావరణాన్ని కాపాడాలని కేజీబీవీ ఎస్ఓ ప్రవంతి అన్నారు. స్థానిక కేజీబీవీలో విద్యార్థులకు మట్టి వినాయకుల ప్రాముఖ్యతను వివరించి వారితో విగ్రహాలను తయారు చేయించినట్లు తెలిపారు. వినాయక చవితి సందర్భంగా పాఠశాల ఆవరణలో మట్టి వినాయకుడిని ప్రతిష్ఠించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీఓపీ, ప్లాస్టిక్ వంటి వాటితో తయారయ్యే విగ్రహాలు రసాయనాలతో తయారు చేస్తారని అవి నీటి కాలుష్యానికి కారణమవుతాయన్నారు. మట్టి విగ్రహాలు సులభంగా మట్టిలో కలిసిపోయి కాలుష్యాన్ని తగ్గిస్తాయని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చేయూత పింఛన్ పెంచాలి



పెన్షనర్లతో మాట్లాడుతున్న కిశోర్

సంగెం : ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ఆసరా పింఛన్ పెంచాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు దామెర కిశోర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో పెన్షనర్లతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు పింఛన్ పెంచుతామని హామీ ఇచ్చి తదనంతరం విస్మరించిందని విమర్శించారు. అధికారంలోకి వచ్చి 20 నెలలు గడచినా వృద్ధులకు, వితంతువులకు, వికలాంగులకు పింఛన్ పెంచకపోవడం సరిదకాన్నరు. ఈనెల 28న గంగదేవిపల్లిలో నిర్వహించనున్న సమావేశానికి పెన్షనర్లందరూ హాజరు కావాలని కోరారు.